ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాల్లో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA
# విజ్ఞాన్ పత్రిక
తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)
APTEL/2024/89102

సంపుటి : 02 సంచిక : 31 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి గురువార 26 ఫిబ్రవరి 2026 పేజీలు : 04 వెల : 02

## అది ప్రణాళికా బద్ధమైన దాడి!



## అమెరికాకు ఇది స్వర్ణయుగం



- ★ భారత్, పాక్ అణు యుద్ధాన్ని నేనే ఆపా : ట్రంప్
- ★ స్టేట్ ఆఫ్ ది యూనియన్ ప్రసంగంలో కీలక వ్యాఖ్యలు
- ★ భారత్ పాక్ యుద్ధం ఆపానంటూ వ్యాఖ్య
- ★ అక్రమ వలసలు తగ్గాయి : ట్రంప్
- ★ ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్
- ★ 'సుప్రీంకోర్టు తీర్పు దురదృష్టకరం'

అమెరికాకు స్వర్ణయుగం మళ్లీ ప్రారంభమైందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను సమర్థించారు. 2026 స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

## రష్యా-ఉక్రెయిన్ కాల్పుల విరమణపై ఐరాసలో తీర్మానం



# ఉద్యానవనంగా మార్కాపురం జిల్లా

- శంకుస్థాపనతో పాటు ప్రారంభించే అవకాశం నాకే వచ్చింది
- రూ.1300 కోట్లతో ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు
- రూ.50 కోట్లతో జిల్లా కలెక్టరేట్ నిర్మిస్తాం
- 2019–24 మధ్య రాష్ట్రానికి చీకటి రోజులు
- వెలిగొండ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష
- మార్కాపురంలో ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం
- జులై 1కి వెలిగొండ నుంచి నీరు విడుదల: సీఎం చంద్రబాబు
- మార్కాపురం జిల్లా దోర్నాల గంటావానిపల్లెలో సీఎం చంద్రబాబు పర్యటన
- వెలిగొండ ఫీడర్ కాలువ పనులకు శంకుస్థాపన చేసిన సీఎం
- రైతులతో కలిసి ఫీడర్ కెనాల్ పనుల పరిశీలన
- మార్కాపురం జిల్లాతో దశాబ్దాల కల సాకారం.. రూ.50 కోట్లతో కలక్టరేట్ నిర్మిస్తామని వెల్లడి
- జిల్లా ఏర్పడ్డాక తొలిసారి వెళ్లిన ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం
- గత పాలకులు ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమిచ్చారని విమర్శ
- వెలిగొండపై వైసీపీ డ్రామాలను ఎండగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులకు సీఎం శంకుస్థాపన
- మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ కళకళ బహిరంగ సభా వేదికలో సీఎం



" 3 వరాలు ఇచ్చేందుకు మార్కాపురం వచ్చా. 1995లోనే మార్కాపురం ప్రజల కష్టాలు చూశా. ఇక్కడి రైతులు సాగునీరు లేకుండా అనేక ఇబ్బందులు పడ్డారు. వెలిగొండ ప్రాజెక్టు వల్ల మార్కాపురం జిల్లాకు అనేక లాభాలు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు బాగుపడతాయి. 2014-19 మధ్య వెలిగొండ పనులను పరుగులు పెట్టించాం. 2019-24 మధ్య వెలిగొండ పనులు మూలన పడ్డాయి. వెలిగొండ వల్ల 4.35 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం నియోజకవర్గాలకు ఎంతో లాభం. ఇక్కన్నుంచి ఉదయగిరి, బద్వేలుకు కూడా నీరు వెళ్తాయి. వెలిగొండ పనులు పూర్తయ్యాయని అప్పటి సీఎం ప్రారంభించారు. 2020లోనే వెలిగొండ పూర్తవుతుందని చెప్పి మిమ్మల్ని మోసం చేశారు." - సీఎం చంద్రబాబు

## ఇజ్రాయెల్‌కు ఎప్పటికీ అండగా భారత్

- ❖ మోదీ సోదర సమానుడు: నెతన్యాహు
- ❖ భారత్, ఇజ్రాయెల్ మధ్య బంధం రక్తం, త్యాగాలతో ఏర్పడింది
- ❖ ఇజ్రాయెల్ గడ్డపై 4 వేల మంది భారత సైనికులు ప్రాణాలర్పించారు
- ❖ మన రెండు దేశాలూ ఉగ్రవాద బాధితులే
- ❖ ఇజ్రాయెల్ పార్లమెంటు నెస్సెట్‌లో మోదీ
- ❖ రక్షణ సహకారం ఎంతో ముఖ్యం
- ❖ మేమూ ఉగ్రవాద బాధితులమే






- ❖ దశల వారీగా చేయూత పింఛను పెంచనున్న ప్రభుత్వం
- ❖ తొలి విడతలో రూ.500 పెంచాలన్న యోచన
- ❖ బడ్జెట్‌లో కేటాయింపులు చేసే అవకాశం
- ❖ ప్రస్తుత పింఛన్ రూ.2,016.. దివ్యాంగులకు 4,016
- ❖ ఏడాదికి అవుతున్న మొత్తం వ్యయం రూ.11,400 కోట్లు
- ❖ రూ.500 పెంచితే అదనంగా.. ఏటా సుమారు రూ.2500 కోట్లు అవసరం
- ❖ విడతల వారీగా 'చేయూత' రూ.4 వేలకు పెంపు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేయూత పథకం ఎన్నికల సమయంలో చేయూత పింఛన్‌ను
కింద ఇస్తున్న పింఛన్‌ను పెంచాలని రాష్ట్ర రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6
ప్రభుత్వం భావిస్తోంది. అయితే రాష్ట్ర ఆర్థిక వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.
పరిస్థితుల దృష్ట్యా.. పింఛను మొత్తాన్ని విడతల ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో భాగంగా
వారీగా పెంచాలన్న అభిప్రాయంతో ఉంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,
ప్రస్తుతం చేయూత పథకం ద్వారా వృద్ధులు, ఒంటరి గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత
మహిళలు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ రోగులు, విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్,
చేనేత, గీత కార్మికులు, బీడీ కార్మికులకు రాష్ట్ర సన్నబియ్యం వంటి హామీలను అమలులోకి
ప్రభుత్వం రూ.2016 చొప్పున, దివ్యాంగులకు తెచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఇప్పుడు పింఛన్ల
రూ.4016 చొప్పున పింఛను ఇస్తోంది. కానీ, పెంపుపై దృష్టి సారించింది.

## మానవత్వానికే మచ్చ..!

- ➤➤ పసిగుడ్డు ఏం పాపం చేసింది?
- ➤➤ బాధిత కుటుంబంతో కలిసి మాట్లాడుతున్న కేటీఆర్
- ➤➤ కుమ్మెర ఘటన మాటలకందని విషాదం
- ➤➤ ఈ కేసులో హంతకులను కాపాడటం సిగ్గుచేటు
- ➤➤ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్
- ➤➤ బాధిత కుటుంబానికి పరామర్శ
- ➤➤ 8 మందిపై హత్య కేసు నమోదు చేయాలి





## దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు : జగన్

- ★ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు వైఎస్ జగన్ భరోసా
- ★ టీడీపీ అరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలి
- ★ పోరాట పంథాను ఎంచుకుని ముందుకు సాగాలి
- ★ కష్టాలు ఎల్లకాలం ఉండవు.. అందరికీ మంచి జరుగుతుంది
- ★ చంద్రబాబు ప్రభుత్వ తీరు దారుణం
- ★ కష్టకాలంలో కార్యకర్తలకు నేతలు అండగా నిలవాలని పిలుపు
- ★ నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు
- ★ నేడు నెల్లూరుకు వైస్ జగన్ పర్యటన

ఎవరూ అధైర్య పడొద్దు.. మంచి రోజులు వస్తాయి.. సమస్యలు శాశ్వతం కాదు.. వచ్చేది మన ప్రభుత్వమే.. అప్పుడు అందరికీ మంచి జరుగుతుంది' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు భరోసా కల్పించారు.

# దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు : జగన్

టీడీపీ అరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. కష్టాలు ఎల్లకాలం ఉండవని, ప్రతి ఒక్కరూ పోరాట పంథాను ఎంచుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలోని భాకరాపురం క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులతో మమేకమయ్యారు. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ.. బాధలు, కష్టాలు, సమస్యలు వింటూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చాలా దారుణంగా వ్యవహరిస్తోందని, అరాచక పాలన సాగిస్తోందని.. అకారణంగా దాడులు చేస్తోందని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్ జగన్ వద్ద వాపోయారు. అందుకు ఆయన స్పందిస్తూ ఎవరూ అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం తీరు దారుణంగా ఉందని, హింసాత్మక రాజకీయాలకు పాల్పడటం మంచిది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్ట కాలంలో కార్యకర్తలకు అండగా నిలబడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు సూచించారు.

**సమస్యలు వింటూ.. ధైర్యం చెబుతూ..**

వివిధ ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురు వైఎస్ జగన్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి కష్టాలు విన్న ఆయన స్వయంగా పరిష్కరించగల వాటికి తక్షణమే స్పందించారు. వారి సమస్య పరిష్కారానికి ఏమి చెయ్యాలో పక్కనే ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి సూచించారు. ప్రభుత్వం నుంచి తమకు ఒక్క మేలు కూడా జరగలేదని వచ్చిన వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉ ంటుందని భరోసానిచ్చిన వైఎస్ జగన్.. వారి పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధ పడుతున్న దివంగత వైఎస్ రాజారెడ్డి సోదరి కమలమ్మను ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ ఈశ్వరయ్యను కూడా ఆయన నివాసంలో పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

**నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు**

వేంపల్లె మండలం నందిపల్లిలోని శ్రీ నందీశ్వర ఆలయంలో నిర్వహించిన నూతన విగ్రహ ప్రతిష్ఠ (శ్రీ పార్వతీ దేవి సమేత మహా నందీశ్వర స్వామి), కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో వైఎస్ జగన్ పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి హోమాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో స్వామి వారికి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం స్వీకరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, భక్తి మార్గం ద్వారా సమాజంలో శాంతి పెంపొందుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణం ద్వారా ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుందని తెలిపారు. నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ చైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి, కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని, శ్రీ నందీశ్వర స్వామి వారి కృపా కటాక్షాలు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.

# రష్యా-ఉక్రెయిన్ కాల్పుల విరమణపై ఐరాసలో తీర్మానం

**ఓటింగ్‌కు భారత్ దూరం**
**రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలై నాలుగేళ్లు పూర్తి**
**కాల్పుల విరమణ కోసం ఐరాసలో ఉక్రెయిన్ తీర్మాణం**
**ఐరాసలో తీర్మానం ఆమోదం**
**మద్దతు తెలిపిన దేశాలకు జెలెన్స్కీ కృతజ్ఞతలు**
**యుద్ధం అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన: ఐరాస చీఫ్**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి నాలుగేళ్లు పూర్తైన వేళ ఇరు దేశాల మధ్య తక్షణ, పూర్తిగా ఎలాంటి షరతులు లేని కాల్పుల విరమణ తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. భారత్? ఈ ఓటింగ్?కు దూరంగా ఉంది. ఉక్రెయిన్? ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి 107 దేశాలు మద్దతు తెలిపాయి. భారత్ సహా 51 దేశాలు ఓటింగ్?కు దూరంగా ఉ ండగా. మరో 12 దేశాలు వ్యతిరేకించాయి.

**ఐరాసలో తీర్మానం ఆమోదం**

'సపోర్ట్ ఫర్ లాస్టింగ్ పీస్ ఇన్ ఉక్రెయిన్' అనే శీర్షికతో ఐరాసలో కీవ్? ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఉక్రెయిన్?పై దాడి చేసి నాలుగేళ్లు పూర్తైన సందర్భంగా ఈ తీర్మానానికి ఐరాసలో ఆమోదం పొందింది. 193 మంది సభ్యులున్న అసెంబ్లీలో ఉక్రెయిన్? ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి 107 దేశాలు మద్దతు తెలపడంతో ఆమోదం లభించింది. భారత్‌తో సహా బహ్రెయిన్, బంగ్లాదేశ్, బ్రెజిల్, చైనా, దక్షిణాఫ్రికా, శ్రీలంక, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అమెరికా వంటి దేశాలు ఓటింగ్‌కు దూరంగా నిలిచాయి.

**మద్దతు తెలిపిన దేశాలకు జెలెన్స్కీ కృతజ్ఞతలు**

ఈ తీర్మానానికి మద్దతు తెలిపిన 107 దేశాలకు ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్?స్కీ కృతజ్ఞతలు తెలిపారు. పూర్తి స్థాయి కాల్పుల విరమణతో పాటు ఉక్రెయిన్ పౌరులను తిరిగి రప్పించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. దీర్ఘకాలిక శాంతి సాధనలో ఈ తీర్మానం కీలకమైన అడుగు అని పేర్కొన్న ఆయన, శాంతి సాధన కోసం ప్రపంచ భాగస్వాములతో కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. 'ఈ రోజు ఐక్యరాజ్యసమితిలో జీవన హక్కును కాపాడే దిశగా ఉ క్రెయిన్‌కు మద్దతుగా నిలిచిన 107 దేశాలకు నేను కృతజ్ఞుడిని. సంపూర్ణ కాల్పుల విరమణతో పాటు మా ప్రజలను తిరిగి రప్పించాలనే స్పష్టమైన పిలుపుతో సాధారణ సభ మా తీర్మానాన్ని ఆమోదించింది. ఇవి సరైనవి, అవసరమైన చర్య. భాగస్వామ్య దేశాలతో కలిసి శాంతి సాధన కోసం మేం చురుకుగా పని చేస్తూనే ఉంటాం' అని జెలెన్?స్కీ పేర్కొన్నారు.

**యుద్ధం అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన: ఐరాస చీఫ్**

ఇదిలా ఉండగా, రష్యా పూర్తి స్థాయి దాడి ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ స్పందించారు. ఈ యుద్ధం అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా, ప్రపంచ శాంతికి ముప్పుగా ఉందని ఆయన అభివర్ణించారు. 'ఫిబ్రవరి 24న రష్యా ఉక్రెయిన్‌పై పూర్తి స్థాయి దాడి ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయ్యాయి. ఇది ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం. ఈ వినాశకర యుద్ధం మన సమష్టి మనసాక్షికి మచ్చ. ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలకు ఇది ఇంకా ముప్పుగానే ఉంది. యుద్ధం ఎంతకాలం కొనసాగితే అంత ఎక్కువ ప్రాణనష్టం జరుగుతోంది. ముఖ్యంగా పౌరులే తీవ్రంగా నష్టపోతున్నారు. 2025లో ఉక్రెయిన్‌లో పౌర మృతుల సంఖ్య గరిష్ఠ స్థాయికి చేరింది.' అని గుటెరెస్? ఎక్స్?లో పోస్ట్ చేశారు. న్యాయసమ్మతమైన, శాశ్వత శాంతి సాధనకు తొలి అడుగుగా తక్షణ, సంపూర్ణ, ఎలాంటి షరతులు లేని కాల్పుల విరమణ అవసరమని గుటెరెస్ పునరుద్ఘాటించారు. 'ఇది పూర్తిగా అంగీకరించలేనిది. న్యాయబద్ధమైన, శాశ్వత, సమగ్ర శాంతి సాధన దిశగా తక్షణ, సంపూర్ణ, ఎలాంటి షరతులు లేని కాల్పుల విరమణకు నేను మళ్లీ పిలుపునిస్తున్నా. శాంతి న్యాయబద్ధంగా ఉండాలంటే అది అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఉండాలి. ఉ క్రెయిన్ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతకు గౌరవం ఇవ్వడం ద్వారానే న్యాయసమ్మతమైన, శాశ్వత శాంతి సాధ్యమవుతుంది' అని గుటెరెస్ పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య పూర్తి స్థాయి యుద్ధం మొదలై మంగళవారం నాటికి నాలుగేళ్లు పూర్తయ్యాయి. ఎన్ని ప్రయత్నాలు చేసిన ఇంతవరకు పరిష్కారం కాలేదు. ఇరు దేశాల మధ్య కాల్పుల విమరణ కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దీంతో యుద్ధం కొనసాగుతూనే ఉంది.

# అది ప్రణాళికాబద్ధమైన దాడి!

- ♦ 8వ తరగతి పిల్లలకు 'న్యాయవ్యవస్థలో అవినీతి'పై పాఠమా?
- ♦ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఫైర్
- ♦ వ్యవస్థ సమగ్రతను దెబ్బతీయడాన్ని ఈ భూమ్మీద ఎవరినీ అనుమతించను
- ♦ ఈ వ్యవహారం ఎంత దూరం వెళ్లినా చట్టం తన పని తాను చేస్తుంది
- ♦ ఎలా డీల్ చేయాలో నాకు బాగా తెలుసు.. ఇప్పటికే ఆదేశాలిచ్చా.. సుమోటోగా తీసుకుంటున్నా
- ♦ చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరిక
- ♦ నేడు సుమోటోగా విచారణ!
- ♦ తక్షణమే స్పందించిన ఎన్‌సీఈఆర్‌టీ
- ♦ వెబ్‌సైట్ నుంచి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకం తొలగింపు

**ఇది ముమ్మాటికీ న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించడమే. దేశ అత్యున్నత న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరిస్తే సహించేది లేదు. చట్టం కఠిన చర్యలు తీసుకుంటుంది.**

**- చీఫ్ జస్టిస్ సూర్యకాంత్**

జాతీయ విద్యాపరిశోధన-శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠంగా చేర్చడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇది జ్యుడీషియరీపై ప్రణాళికాబద్ధమైన, లోతైన దాడిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభివర్ణించారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఈ భూమ్మీద ఎవరినీ అనుమతించనని తేల్చిచెప్పారు. న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంలో పొందుపరచింది. న్యాయవ్యవస్థలో అవినీతి, భారీగా పెండింగ్ కేసులు, న్యాయాధికారులు/న్యాయమూర్తుల కొరతను కూడా అందులో ప్రస్తావించింది. 'మన సమాజంలో న్యాయవ్యవస్థ పాత్ర' పేరుతో ఈ అధ్యాయాన్ని చేర్చింది. గత సంచికల్లో న్యాయవ్యవస్థ, కోర్టుల పాత్ర వరకే పరిమితం కాగా.. సోమవారం విడుదల చేసిన నూతన పాఠ్యపుస్తకంలో కోర్టుల వ్యవస్థ, న్యాయం ఎంతవరకు అందుతోంది.. అనే అంశాలపై విస్తృతంగా చర్చించారు. అదే సమయంలో న్యాయవ్యవస్థలో అవినీతి, ఆర్థికంగా బలహీన వర్గాలకు న్యాయం అందించడంలో దాని ప్రభావం గురించి వివరించారు. ఈ అంశాన్ని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మనుసింఘ్వీ బుధవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎస్.పంచోలితో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఆ పాఠ్యపుస్తకంలోని సదరు అధ్యాయం అవమానకరంగా ఉందని.. ఆ పుస్తకం ప్రతులు తమ వద్ద ఉన్నాయని సిబల్ తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకంలో 8వ తరగతి పిల్లలకు న్యాయవ్యవస్థలో అవినీతిని నేర్పిస్తుండడం చూసి ఈ వ్యవస్థలో సభ్యులుగా ఆందోళన చెందుతున్నామన్నారు. న్యాయవ్యవస్థలో మాత్రమే అవినీతి ఉన్నట్లు పేర్కొన్నారని.. రాజకీయ నాయకులు, మంత్రులు, బ్యూరోక్రాట్లు, ఇతరుల గురించి ఒక్క మాట కూడా లేదని.. ఇది తమను కలవరపరుస్తోందని సింఘ్వీ అన్నారు. దీనిపై చీఫ్ జస్టిస్ స్పందించారు. 'ఇది కచ్చితంగా మొత్తం వ్యవస్థను, అందులోని భాగస్వాములను ఆందోళనకు గురిచేస్తోంది. ఒక్క రోజు ఆగండి. ఇప్పటికే నేను సుమోటోగా ఈ వ్యవహారాన్ని పరిగణనలోకి తీసుకున్నాను. ఆదేశాలు కూడా ఇచ్చాను. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను, సమగ్రతను దెబ్బతీయడానికి ఈ భూమ్మీద ఏ ఒక్క వ్యక్తినీ అనుమతించే ప్రసక్తే లేదు. ఏ పరిస్థితుల్లోనూ ఇందుకు అనుమతించను. ఈ వ్యవహారం ఎంత దూరం వెళ్లినా.. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. దీనినెలా డీల్ చేయాలో నాకు బాగా తెలుసు' అని సీజేఐ తేల్చిచెప్పారు. ఇది చాలా ప్రణాళికాబద్ధమైన, లోతైన దాడిగా కనిపిస్తోందన్నారు. ఇంతకు మించి ఏమీ మాట్లాడాలనుకోవడం లేదని చెప్పారు. తన విధి తాను నిర్వర్తించానని స్పష్టంచేశారు. ఈ అంశాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చినందుకు సిబల్, సింఘ్వీలకు ధన్యవాదాలు తెలియజేశారు. కాగా.. ఈ వివాదంపై త్రిసభ్య ధర్మాసనం గురువారం సుమోటోగా విచారణ జరిపే అవకాశముంది.

**వెబ్‌సైట్ నుంచి 'పాఠ్యపుస్తకం' మాయం**

సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం నేపథ్యంలో ఎన్‌సీఈఆర్‌టీ తక్షణమే స్పందించింది. తన వెబ్‌సైట్ నుంచి 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాన్ని తొలగించింది. అందులోని న్యాయవ్యవస్థ తాలూకు వివాదాస్పద అంశాలను కూడా తొలగించాలని జాతీయ మండలి యోచిస్తోందని కేంద్రప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఎన్‌సీఈఆర్‌టీ స్వతంత్ర సంస్థ అని.. పాఠ్యపుస్తకాల్లో అధ్యాయాలను చేర్చేటప్పుడు దాని అధికారులు బుర్రపెట్టి ఉండాల్సిందని కేంద్రప్రభుత్వ వర్గాలు వ్యాఖ్యానించాయి. న్యాయవ్యవస్థకు సంబంధించిన సదరు అంశాల కూర్పులో సమతౌల్యం లేదని పేర్కొన్నాయి. 'పెండింగ్ కోర్టు కేసులు, న్యాయవ్యవస్థలో అవినీతిపై ఆ పుస్తకంలో చర్చించారు. అయితే భారత వ్యవస్థాగత ఫ్రేమ్‌వర్క్ ఎలా ఉంటుందో చెప్పడమే దాని ఉద్దేశమైతే.. పార్లమెంటు, కార్యనిర్వాహక వర్గం పాత్రలకు కూడా సమ ప్రాధాన్యం ఇచ్చి ఉండాల్సింది. కేవలం న్యాయవ్యవస్థకు సంబంధించిన అంశాలనే ప్రస్తావించడం వల్ల విద్యార్థుల్లో తప్పుడు అవగాహన సృష్టించే అవకాశం ఉంది' అని స్పష్టం చేశాయి. ఈ వ్యవహారంపై ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్ దినేశ్ ప్రసాద్ సక్లానీ స్పందించలేదు.

# అమెరికాకు ఇది స్వర్ణయుగం

అలాగే భారత్?-పాక్ యుద్ధాన్ని తానే ఆపినట్లు పునరుద్ఘాటించారు. అలాగే అణు ఒప్పందం చేసుకోకపోతే దాడులు తప్పవ్ అంటూ హెచ్చరించారు. 'అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలి 10 నెలల్లోనే నేను ఎనిమిది యుద్ధాలు ముంగిచా. కంబోడియా- థాయ్‌లాండ్, పాకిస్థాన్- భారత్ మధ్య అణు యుద్ధం జరిగేదే. నా జోక్యం లేకపోతే 3.5 కోట్ల మంది చనిపోయేవారని పాకిస్థాన్ ప్రధాని అన్నారు. నేను అధ్యక్షుడిగా ఉన్నట్లయితే రష్యా- ఉ క్రెయిన్ యుద్ధం జరిగేది కాదు. రెండు దేశాల మధ్య జరుగుతున్న హింసను ఆపేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది' అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే భారత్? యుద్ధాన్ని ప్రస్తావిస్తున్నప్పుడు తను లేకపోతే పాక్ ప్రధాని చనిపోయి ఉండేవారని ట్రంప్ నోరు జారారు. కానీ వెంటనే 3.5 కోట్ల మంది యుద్ధంలో చనిపోయేవారని పాక్ ప్రధాని తనతో చెప్పినట్లు వెల్లడించారు.

**ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్**

ఇరాన్ తన అణు, క్షిపణి సామర్థ్యాలను పెంపొందించుకునే ప్రయత్నాలను తిరిగి ప్రారంభిస్తోందని డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఇలాంటి వాటికి అనమతించకూడదనేది అమెరికా విధానమని తెలిపారు. అయితే దౌత్యపరమైన పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తానని చెప్పినా, అవసరమైతే కఠిన నిర్ణయాలకు వెనుకాడబోనని హెచ్చరించారు. 'యూరప్, విదేశాల్లోని మా స్థావరాలను లక్ష్యంగా చేసుకునే క్షిపణులను వారు ఇప్పటికే అభివృద్ధి చేశారు. త్వరలో అమెరికాను కూడా చేరుకునే క్షిపణుల తయారీలో ఉ న్నారు. దౌత్యపరంగా సమస్యను పరిష్కరించడమే నా ఉద్దేశం. కానీ ప్రపంచంలో అగ్రగామి ఉగ్రవాద ప్రోత్సాహక దేశానికి అణు ఆయుధాలు కలిగి ఉండటానికి నేను ఎప్పటీ అనుమతించను. అలా జరగకూడదు' అని ట్రంప్ స్పష్టం చేశారు.

**అక్రమ వలసలు తగ్గాయి : ట్రంప్**

అమెరిగా గతంలో కన్నా ఇప్పుడు మెరుగ్గా సుసంపన్నంగా మారిందని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. 'గత తొమ్మిది నెలల్లో అక్రమ విదేశీయలు ఎవరూ అమెరికాలోకి ప్రవేశించలేదు. చట్టబద్ధంగా లోపలికి అమెరికాలో వచ్చే వారికి ఎల్లప్పుడూ అనుమతిస్తాం. అక్రమ వలసలను, ప్రాణాంతక ఫెంటనిల్‌లను సమర్థంగా అడ్డుకుంది. ఇక జో బైడెన్ పాలనలో దేశ చరిత్రలోనే అత్యంత దారుణమైన ద్రవ్యోల్బణాన్ని చూశాం. కానీ 12 నెలల్లో నా పరిపాలన ఐదు సంవత్సరాలకు పైగా కనిష్ఠ స్థాయికి కోర్ ద్రవ్యోల్బణాన్ని తగ్గించింది. 2025 చివరి మూడు నెలల్లో ఇది 1.7 శాతానికి తగ్గింది. గత ప్రభుత్వం నాలుగేళ్లలో అమెరికాలో 1 ట్రిలియన్ డాలర్ల కంటే తక్కువ పెట్టుబడులు తీసుకొస్తే, ఒక్క సంవత్సరంలోనే తన కార్యవర్గం 18 ట్రిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు సాధించాం. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో నిర్బంధం తర్వాత, ఆ దేశం నుంచి 80 మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురు అమెరికాకు వచ్చాయి' అని డొనాల్డ్ ట్రంప్ వివరించారు.

**'సుప్రీంకోర్టు తీర్పు దురదృష్టకరం'**

ప్రపంచ దేశాలపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దురదృష్టకరమని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. కానీ దాదాపు అన్ని దేశాలు తమతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని కొనసాగించాలని కోరుకుంటున్నాయని అన్నారు. దశాబ్దాలుగా మనల్ని మోసం చేసిన దేశాలు ఇప్పుడు మనకు వందల బిలియన్ డాలర్లు చెల్లిస్తున్నాయని పేర్కొన్నారు. ఆధునిక ఆదాయపు పన్ను వ్యవస్థను భర్తీ చేయడానికి టారిఫ్‌లు విధించినట్లు తెలిపారు. విదేశాలపై మోపిన సుంకాలు అమెరికా ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తాయన్నారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్‌తో అమెరికన్లకు ఉపశమనమని ట్రంప్ అభివర్ణించారు. అదే సమయంలో దీనిని వ్యతిరేకించిన డెమొక్రాట్లను తీవ్రంగా విమర్శించారు. ప్రజలను బాధపెట్టడానికి వారు పెద్ద ఎత్తున పన్ను పెంచాలని కోరుకుంటున్నారని అన్నారు.

# పేదల సొంత ఇంటి కల నెరవేర్చండి

**- విజిలెన్స్ విచారణలతో కాలయాపన చేయకుండా పేదలకు ఇళ్లు దక్కేలా తక్షణ చర్యలు చేపట్టాలి.**

**- భూసేకరణ పేరుతో కొంత, ల్యాండ్ డెవలప్‌మెంట్ పేరుతో మరికొంత మొత్తాన్ని గత పాలకులు దోచుకుంటే.. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండానే కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసుకున్నారు.**

**- గత ప్రభుత్వ తప్పిదాల వల్ల పేదల సొంత ఇంటి కల కలగానే మిగిలిపోయింది**

**- శాసనసభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

**కోవూరు /ఫిబ్రవరి విజ్ఞాన్**

గత ప్రభుత్వ తప్పిదాల వల్ల పేదల సొంత ఇంటి కల కలగానే మిగిలి పోయిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శాసనసభ సమావేశాలలో పేదల పక్కా ఇళ్ల సమస్యపై ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ అవినీతిపై ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ విషయంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, అవకతవకల వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గ్రామీణ ప్రాంతాలలోని క్షేత్రస్థాయి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. భూసేకరణ పేరుతో కొంత మొత్తం, ల్యాండ్ డెవలప్‌మెంట్ పేరుతో మరి కొంతమొత్తాన్ని గతపాలకులు



దారిమళ్లించారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆరోపించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయకుండాకాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసుకున్నారని నియోజకవర్గ పరిధిలో వేలాదిగా పునాది దశలోనే ఆగిపోయిన అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల గురించి ఆమె సభలో ప్రస్తావించారు. నియోజకవర్గ పరిటాల పర్యటనలకు వెళ్ళినప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు తమకు ఇల్లు కావాలని కోరుతున్నారని ఆమెతెలి పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు సంతోషంగా ఉన్నప్పటికీ ఈగృహనిర్మాణ సమస్య మాత్రం వారిని వేధిస్తోందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఎన్నిసార్లు చర్చించుకున్నా పేదల ఇళ్ల సమస్య మాత్రం కొలిక్కి రావడం లేదని విజిలెన్స్ విచారణలతో కాలయాపన చేయకుండా పేదలకు ఇళు దక్కేలా తక్షణ చర్యలు చేపట్టాలి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల పక్షాన నిలబడి యుద్ధ ప్రాతిపదికన పక్కా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా ఒక స్పష్టమైన పరిష్కారం కనుగొనాలని ఆమె గృహ నిర్మాణ శాఖ మంత్రి కి సూచించారు. బడుగు బలహీన వర్గాల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేయాలని కోరారు.

# కొండ బిట్రగుంట బ్రహ్మోత్సవాలకు ఎంపీ విపిఆర్‌కు ఆహ్వానం

**- 2.10 కోట్లతో స్వామి పుష్కరిణిని పునరుద్ధరించిన విపిఆర్ దంపతులు**
**- మార్చి 7న కోనేరులో స్వామివారి చక్రస్నానం**



కొండ బిట్రగుంటలో వెలిసిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనవలసిందిగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఆలయ ఈవో రాధాకృష్ణ ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం నెల్లూరు నగరంలోని విపిఆర్ నివాసంలో ఎంపీ వేమిరెడ్డిని కలిసిన వారు.. బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 8 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించనున్న వారు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ల దాతృత్వంతో రూ.2.10 కోట్లతో శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి పుష్కరిణిని పునరుద్ధరణ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా నూతన కోనేరులో వచ్చే నెల 7న స్వామివారి చక్రస్నానం నిర్వహించేందుకు ఆలయ అధికారులు, అర్చకులు ఏర్పాట్లు చేస్తున్నారు..

# ఉద్యానవనంగా మార్కాపురం జిల్లా

**గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం పలికిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మార్కాపురం జిల్లా ప్రజలు జేజేలు పలికారు. నూతన జిల్లాను ఏర్పాటుచేయడం తోపాటు వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసే విషయంలో ప్రభుత్వ నిర్దిష్ట విధానంతో సంతృప్తిచెందిన వారు ఆయన పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. సీఎం కూడా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను నిశితంగా పరిశీలించారు. దీంతోపాటు వెనుకబడిన మార్కాపురం జిల్లా అభివృద్ధి, వెలిగొండ జలాలు నాలుగు నియోజకవర్గాలకు అందించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించి మాట్లాడారు. కొన్నింటిపై నిర్దిష్ట ప్రకటనలు చేయడం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. గత వైసీపీ ప్రభుత్వంలో మార్కాపురం ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటిన ముఖ్యమంత్రి మెడికల్ కాలేజీ వ్యవహారాన్ని ప్రస్తావించకపోవడం చర్చనీయాంశంగా మారింది.**

ఈ ఏడాది జులై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తిచేసి మార్కాపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుడిలా ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ రిబ్బన్ కటింగ్లు చేసి దొంగ నాటకాలు ఆడటం తమకు చేతకాదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వెనుకబాటుకు గురైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. దీనికోసం విశ్రాంత ఇంజనీర్లతో ఓ బృందాన్ని వేసి అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ప్రతీ ఎకరాకూ సాగునీరు ఇచ్చే అంశంపై బ్లూ ప్రింట్ తయారు చేస్తామని అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లెలో రూ.456 కోట్లతో వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రైతులతో కలిసి పనులను పరిశీలించారు.

అనంతరం మార్కాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, "గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేటు ఇచ్చారు. అరకు మొదలుకొని ప్రకాశం వరకూ మంచి విజయం అందించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం, మదనపల్లి, పోలవరం ప్రాంతాలను జిల్లాలు చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు నిలబెట్టుకున్నాను. ఇక్కడి ప్రజలు 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలు కు వెళ్లాల్సిన పని లేకుండా మార్కాపురాన్ని జిల్లా చేశాను. అన్యాయం జరిగిన మదనపల్లికి న్యాయం చేశా" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

శంకుస్థాపనతో పాటు ప్రారంభించే అవకాశం నాకే వచ్చింది

"1996, మార్చి 5న ఈ ప్రాంతంలో నేను పర్యటించినప్పుడు ప్రజల కష్టాలు కళ్లారా చూశాను. శ్రీశైలం నుంచి నీరివ్వమని ఇక్కడి ప్రజలు నన్ను కోరారు. ఆనాడు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాం. భగవంతుడు మళ్లీ నాకే అవకాశం ఇచ్చాడు. వెలిగొండను పూర్తి చేసి మీ జీవితాల్లో వెలుగులు తెస్తాను. రైతులను ఆదుకుంటాం. 2014-2019లో ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించాం. ఈ ప్రాజెక్టు ద్వారా 4.35 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యం. దీని వల్ల గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలకే కాకుండా ఉదయగిరి, కడప జిల్లా బద్వేలుకు కూడా నీరు అందుతుంది. 2019లో మనమే అధికారంలోకి వచ్చి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీరిచ్చేవాళ్లం. 2019-2024 మధ్య చీకటి రోజులు వచ్చాయి.

గత ముఖ్యమంత్రి వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ దొంగ నాటకాలు ఆడాడు. చీమకుర్తి, మార్కాపురం సభల్లో 2023లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చాడు. ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కటింగ్ చేశాడు. ఇలా చేయడం మోసం కాదా. నేను చేయగలిగిందే చెబుతున్నాను. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి రూ.9081 కోట్ల నిధులు కావాలి. ఇప్పటి వరకూ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు చేశాం. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేశాం. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశాం. ఇంకా రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావు. గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపట్టాం. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశాను. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని రైతులకు పంగ నామాలు పెట్టారు. మంచి చేసిన వారికి అండగా నిలిస్తేనే ప్రజల జీవితాలు మెరుగు అవుతాయి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**రూ.1300 కోట్లతో ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు**

"అన్ని వర్గాలకు న్యాయం చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. ఎక్కడ పేదలు ఉంటే అక్కడ నేను ఉంటాను. ఎన్నికల్లో చెప్పినట్టే సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పింఛన్ల కోసం ప్రతి ఏటా రూ.34 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీ శక్తి కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. మగవారితో సమానంగా మహిళలకు అవకాశాలు రావాలని డ్వాక్రా సంఘాలు స్థాపించాను. ఈ ఏడాది లక్షమంది ఆడబిడ్డలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రైతులకు మూడు విడతల్లో రూ. 20,000 ఇస్తున్నాం. 2027లో పుష్కరాలకు ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. నల్లమల సాగర్ కు గోదావరి నీళ్లు ఇస్తాం. అది వచ్చేలోగా ఈ ఏడాది జులై నాటికి నల్లమల సాగర్ పూర్తి చేసి వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తాం. ఈ ప్రాజెక్టు కోసం ఇంకా రూ. 2 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. గతేడాది హంద్రినీవాపై శ్రద్ధ పెట్టాం. ఈ ఏడాది వెలిగొండ పై శ్రద్ధ పెట్టి ప్రజల జీవితాల్లో జలకళ తీసుకొస్తాం. హార్టికల్చర్ కు ఎక్కువ ప్రాధాన్య ఇస్తున్నాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తున్నాం. సీమతో పాటు మార్కాపురం, ప్రకాశం జిల్లాలను ఉద్యాన పంటలతో అభివృద్ధి చేస్తాం. మార్కాపురాన్ని ఉద్యాన పంటలకు కేంద్రంగా తయారు చేసేందుకు ప్రజలు సహకరించాలి. రూ.1300 కోట్లు వ్యయంతో నల్లమల సాగర్ నుంచి ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందించే బాధ్యత తీసుకుంటాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**రూ.50 కోట్లతో జిల్లా కలెక్టరేట్ నిర్మిస్తాం**

"ప్రజలకు హామీ ఇచ్చినట్టుగానే మార్కాపురాన్ని జిల్లాగా చేసి ఇక్కడి ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చాం. మార్కాపురం జిల్లాలో భూ రికార్డుల సమస్యలున్నాయి. మేము అధికారంలోకి వస్తూనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాం. గత పాలనలో ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు. అడిగిన భూములు ఇవ్వకపోతే 22ఏలో పెట్టారు. సర్వే రాళ్లపై వారి ఫోటోలు వేసుకున్నారు. మేము రాజముద్రతో పట్టదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. క్యూఆర్ కోడ్ తో భూమి రికార్డులు భద్రంగా తయారు చేయిస్తున్నాం. ఎవరైనా తప్పు రికార్డులు చేస్తే తాట తీస్తామని హెచ్చరిస్తున్నాను. మార్కాపురం జిల్లా నూతన కలెక్టరేట్ భవనానికి రూ. 50 కోట్లు మంజూరు చేస్తున్నాం. 20 నెలల పాలనలో రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి.

యువతకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటాం. అవినీతికి తావు లేకుండా మెగా డీఎస్సీ నిర్వహించాం. కానిస్టేబుళ్ల నియామకాలు పూర్తి చేశాం. వరద నీరు వృథాగా పోకుండా భూగర్భ జలాలు పెంచుతాం. గోదావరి నుంచి 6000 టీఎంసీలు, కృష్ణా నుంచి 1500 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లింది. వెలిగొండ ప్రాజెక్టుకు కావాల్సింది కేవలం 53 టీఎంసీల నీరే. ఈ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఉంది. ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో సురక్షిత నీరు సరఫరా చేస్తాం. పరిశుభ్రమైన రాష్ట్రం కోసం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నాం. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పీ4 కార్యక్రమం చేపట్టాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి తెలిపారు.

**2019-24 మధ్య రాష్ట్రానికి చీకటి రోజులు**

"గత పాలకులు చేయని అపచారం లేదు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారు. కెమికల్స్ కలిపిన నెయ్యితో లడ్డూలు చేసి విక్రయించారు. ఆ నెపాన్ని హెరిటేజ్ పై మోపారు. ఆనాడు బాబాయ్ ని చంపేసి మరుసటి రోజు సాక్షి పత్రికలో నారా సుర రక్త చరిత్ర అని నా చేతిలో కత్తి పెట్టాడు. నోరు తెరిస్తే బూతులు మాట్లాడతారు. నా తల్లి, భార్య, మా పార్టీ నేతలను ఇష్టానుసారంగా దుర్భాషలాడారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రారు కానీ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కావాలంటారు. వాళ్లు బెదిరిస్తే ఇవ్వాలా. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓట్లు వేస్తేనే ఏదైనా సాధ్యం అని కూడా వారికి తెలీదా? గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంస జరిగింది. ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడ్డారు. గంజాయి, భూ కబ్జాలు, దౌర్జన్యాలతో హడలిపోయారు. నేను ఎవరు తిట్టినా లెక్కపెట్టుకోను. నేను జీవిస్తోంది ప్రజలు, రాష్ట్రం కోసమే. నాకు కుల, మత విభేదాలు లేవు. తెలుగు జాతి అభ్యున్నతి నాకు ముఖ్యం. బడుగు, బలహీన వర్గాలను పైకి తీసుకొచ్చి అవకాశాలు కల్పిస్తాం. నేను ఆనాడు టెక్నాలజీని ప్రమోట్ చేశాను. మన దూరదృష్టి కారణంగా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణ నుంచి వస్తోంది. గుజరాత్ రాష్ట్రంలో 25 ఏళ్లుగా ఒకే పార్టీ అధికారంలో ఉంది. మోదీ 3వ సారి ప్రధాని అయ్యారు. మరోసారి అవుతారు. ప్రజలు ఏది మంచి, ఏది చెడు అనేది ఆలోచన చేసి...కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమర్థులను గెలిపించాలి" అని ముఖ్యమంత్రి కోరారు.

**స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కాలువ పనులు పరిశీలన**

వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ పనుల శంకుస్థాపన అనంతరం రైతులు వెంకటేశ్వరరెడ్డి, సురవరం గండి వీరారెడ్డిలతో సంభాషిస్తూ ఫీడర్ కెనాల్ పనుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. వెలిగొండ పూర్తి అయితే ఈ ప్రాంత భూగర్భజలాలు కూడా పెరుగుతాయని, బోర్లకు, చెరువులకు నీరు వస్తాయని ముఖ్యమంత్రికి రైతులు వివరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనులు, ఫీడర్ కాలువ పనులు వేగంగా చేపడుతున్నందుకు ముఖ్యమంత్రికి స్థానిక రైతులు ధన్యవాదాలు తెలిపారు. అరటి, బొప్పాయి లాంటి పంటల సాగు చేసేందుకు అనుకూల ప్రాంతమని, మీరే శంకుస్థాపన చేశారు, మీరే ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేస్తున్నారని ముఖ్యమంత్రితో రైతులు అన్నారు. ప్రాజెక్టులో రూ.2500 కోట్ల విలువైన పనులు మిగిలి ఉన్నా వాటిని పూర్తి చేయకుండా జాతికి అంకింతం చేసినట్టు గత పాలకులు నాటకాలాడారని ముఖ్యమంత్రి విమర్శించారు.

**వెలిగొండ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష**

ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, పనులు జరుగుతున్న తీరుపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. 11,580 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా ఫీడర్ కాలువ పనులు చేపట్టామని జల వనరుల శాఖ అధికారులు వివరించారు. నల్లమల సాగర్ ప్రాంతంలో మూడు గ్యాప్స్ ఫిల్ చేసి రిజర్వాయర్ ఏర్పడిందని , తద్వారా 53.83 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. రోజుకు 200 మీటర్ల మేర కాలువ లైనింగ్ పనులు చేస్తున్నామని , 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల మేర సైడ్ వాల్ పనులు మే చివరి నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి తెలిపారు. ఫ్లడ్ సీజన్ ప్రారంభం అయ్యే సమయానికి ఫీడర్ కాలువ సిద్ధం అయిపోతుందని వెల్లడించారు. 45 రోజుల్లో 45 టీఎంసీల మేర నీరు డ్రా చేసుకుని నల్లమల సాగర్ నింపేందుకు ప్రణాళిక చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు.

వెలిగొండ ప్రాజెక్టు సొరంగాలు, కాలువ పనులు తదితర అంశాలను నమూనా ద్వారా వివరించారు. కంబం చెరువును కూడా నింపేలా కాలువను అనుసంధానించినట్టు తెలిపారు. స్థానికంగా వివిధ చెరువులు, నీటి వనరుల్ని నింపేందుకు అవసరమైన స్ట్రక్చర్లను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశించారు. రూ. 400 కోట్లతో ఈ పనులు చేపట్టేందుకు వీలుగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. వెలిగొండ టన్నెళ్ల పనులు పూర్తి అయ్యాక, పోరుమామిళ్ల, రాచర్లకు కూడా నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేయాలని, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి ఎప్పటికప్పుడు తనకు తెలియచేయాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

**మార్కాపురంలో ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం**

నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలిసారి మార్కాపురంలో పర్యటించిన ముఖ్యమంత్రికి ఘన స్వాగతం లభించింది. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. జిల్లా ఏర్పాటు కలను నిజం చేసినందుకు ముఖ్యమంత్రికి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ జలకళ సభకు హాజరైన ముఖ్యమంత్రికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. వేదిక నుంచి ప్రజల మధ్యకు వేసిన ర్యాంపు పై నడుస్తూ, ప్రజలకు అభివాదం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ప్రజలు హర్షాతిరేకాల మధ్య ఆయన ప్రసంగం యావత్తూ ఉత్సాహంగా సాగింది. సభకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు, అభిమానులు తరలి వచ్చారు.

# ఇజ్రాయెల్‌కు ఎప్పటికీ అండగా భారత్

భారత్, ఇజ్రాయెల్ మధ్య బంధం రక్తం, త్యాగాలతో ఏర్పడిందని ప్రధాని మోదీ అన్నారు. భారత్, యూదు నాగరికతల మధ్య ప్రాచీన కాలం నుంచి మంచి సంబంధాలున్నాయని తెలిపారు. మొదటి ప్రపంచ యుద్ధంలో 1918, సెప్టెంబర్‌లో ప్రస్తుత ఇజ్రాయెల్‌లోని హైఫా వద్ద స్థానికులను కాపాడేందుకు శత్రువులతో పోరాడుతూ 4 వేల మందికిపైగా భారత సైనికులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. ఈ రెండు దేశాలు ఉగ్రవాద బాధితులేనని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా నిర్మూలించాల్సిందేనని పునరుద్ఘాటించారు. రెండు రోజుల పర్యటన కోసం బుధవారం ఇజ్రాయెల్ చేరుకున్న ప్రధాని మోదీ.. ఆ దేశ పార్లమెంటులోని హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ నెస్సెట్‌లో ప్రసంగించారు. నెస్సెట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని మోదీయే. 'ఈ భూమితో భారత బంధం రక్తం, త్యాగాలతో ముడిపడి ఉంది. ఇక్కడ(నెస్సెట్) నిలబడటం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఒక గొప్ప నాగరికతకు చెందిన ప్రతినిధి.. మరో గొప్ప నాగరికతను ఉద్దేశించి మాట్లాడుతున్నాడు' అని మోదీ అన్నారు.

**మేమూ ఉగ్రవాద బాధితులమే**

ఇజ్రాయెల్‌పై 2023, అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు జరిపిన దాడిని మోదీ ఖండించారు. 'అక్టోబర్ 7దాడిలో మరణించిన ప్రతి వ్యక్తి కుటుంబానికి భారతీయుల సంతాపాలను మోసుకొని నేనిక్కడికి వచ్చాను. మీ బాధ మాకు తెలుసు. మీ దుఃఖాన్ని మేము అర్థం చేసుకోగలం. ఇప్పుడే కాదు.. ఎప్పటికీ ఇజ్రాయెల్‌కు మద్దతుగా భారత్ స్థిరంగా నిలబడుతుంది. సామాన్య పౌరులను చంపటాన్ని ఏవిధంగానూ సమర్థించుకోలేరు. సుదీర్ఘకాలంగా భారత్ కూడా ఉగ్రవాద బాధితురాలే. ముంబైలో 26/11 ఉగ్ర దాడుల్లో భారతీయులతోపాటు ఇజ్రాయెలీలు కూడా మరణించారు. మీలాగే మేము కూడా ఉగ్రవాదంపై కఠిన వైఖరితో ఉన్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉగ్రవాదాన్ని సహించేది లేదు. ప్రపంచంలో ఎక్కడైనా శాంతికి ఉగ్రవాదంతో ముప్పే. ఉగ్రవాద నిర్మూలనకు అన్ని దేశాల మధ్య సమన్వయం అవసరం. అందుకే గాజా శాంతి ప్రణాళికకు భారత్ మద్దతిస్తోంది. ఈ ప్రణాళిక ఈ ప్రాంతంలోని ప్రజలందరికీ న్యాయం, శాంతి అందిస్తుందని భారత్ బలంగా నమ్ముతోంది' అని మోదీ తెలిపారు.

**రక్షణ సహకారం ఎంతో ముఖ్యం**

ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు రోజురోజుకు సంక్లిష్టంగా మారుతున్న నేపథ్యంలో నమ్మకమైన మిత్ర దేశాలైన భారత్-ఇజ్రాయెల్ మధ్య రక్షణ రహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవటం చాలా ముఖ్యమని మోదీ అన్నారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో రక్షణ సహకారమే అతి ముఖ్యమైనదని పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌ను 'స్టార్టప్ దేశం' అని సంబోధించిన మోదీ.. భారత యువత కూడా ఆవిష్కరణల్లో దూసుకుపోతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్ తదితరులు పాల్గొన్నారు.

**మోదీ సోదర సమానుడు: నెతన్యాహు**

భారత ప్రధాని మోదీ తనకు స్నేహితుడికంటే ఎక్కువ అని, సోదర సమానుడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. మోదీ కంటే ముందు నెస్సెట్‌లో ప్రసంగించిన ఆయన.. మోదీపై ప్రశంసలు కురిపించారు. 'ప్రపంచంలో గొప్ప నేతల్లో ఒకరు, నా ప్రియమైన మిత్రుడు నరేంద్రమోదీకి జెరూసలేం స్వాగతం పలుకుతోంది. నరేంద్ర (ఏకవచనం) నాకు మిత్రుడు, సోదరుడు. ఇజ్రాయెల్- భారత్ సంబంధాలను బలోపేతం చేయటంలో మోదీయే చాంపియన్. ఆయన ఇజ్రాయెల్‌కు గొప్ప స్నేహితుడు. మోదీ ఆలింగనం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. 140 కోట్ల జనాభాతో ప్రపంచంలోనే అతి శక్తిమంతమైన దేశాల్లో భారత్ ఒకటి. ఇజ్రాయెల్ కూడా శక్తిమంతమైనదే. ఇస్లామిక్ వేర్పాటువాదానికి వ్యతిరేకంగా మన రెండు దేశాలు కలిసి ఉక్కు బంధాన్ని ఏర్పాటు చేసుకోవాలి' అని పిలుపునిచ్చారు. కాగా, మోదీ ప్రసంగానికి ఇజ్రాయెల్ సుప్రీంకోర్టు ప్రెసిడెంట్ ఐసాక్ అమిత్‌ను ఆహ్వానించకపోవటాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష ఎంపీలు నెస్సెట్ నుంచి వాకౌట్ చేశారు.

# పింఛను పెంపు!

అయితే ఈ హామీని కొంతకాలం ఆగాక నెరవేర్చడమా? లేదంటే ఇప్పటి నుంచే విడతల వారీగా పింఛను పెంచుతూ వెళ్లడమా? అని ఉన్నత స్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. విడతలవారీగా పెంచితే.. తొలి విడతలో రూ.500 పెంచాలన్న అభిప్రాయంతో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.

**42.7 లక్షల మందికి పింఛను..**

2024 సామాజిక సర్వే లెక్కల ప్రకారం ప్రస్తుతం 42.7 లక్షల మందికి పింఛను అందుతోంది. ఇందుకోసం ప్రతి నెలా రూ.950 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఈ పింఛన్‌ను ప్రస్తుతానికి రూ.500 చొప్పున పెంచితే.. నెలకు సుమారు రూ.210 కోట్లు అదనంగా అవసరమవుతాయి. అంటే ఏడాదికి రూ.2500 కోట్లకు పైగా భారం ప్రభుత్వంపై పడనుంది. దీనిపై తుది నిర్ణయానికి వచ్చాక బడ్జెట్‌లో కూడా ప్రస్తావించే అవకాశాలున్నాయి. తొలి విడతలో పెంచాలని భావిస్తున్న మొత్తాన్ని కూడా కలిపి బడ్జెట్‌లో కేటాయింపులు చేయన్నుట్లు తెలుస్తోంది. కాగా, దివ్యాంగుల పింఛను పొందేవారు తక్కువ సంఖ్యలోనే ఉన్నారని, వీటి వరకు కొంత ఎక్కువ మొత్తం పెంచాలన్న విజ్ఞప్తులు కూడా ఉన్నాయి. అయితే అందరికీ ఒకే విధంగా, సమ స్థాయిలోనే పెంచాలని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. చేయూత ఫించన్లను ఇలా విడతల వారీగా పెంచుతూ ఎన్నికల నాటికి రూ.4 వేలకు తీసుకెళ్లాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారుల స్థాయిలో మాత్రం చర్చలు మొదలుకాలేదు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్నాకే తమకు సమాచారం చేరుతుందని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.

# మానవత్వానికే మచ్చ..!

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన దాడి ఘటనలో హంతకులను కాపాడే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కుమ్మెర జాతరలో జరిగిన ఘటన మాటలకు అందని విషాదం అని చెప్పారు. రెండు నెలల పసిగుడ్డు ఏం పాపం చేసిందని దుర్మార్గంగా ప్రవర్తించారని మండిపడ్డారు. శిశువు మరణిస్తే కూడా హత్యకేసు పెట్టకపోవుముదుమేంటని ప్రశ్నించారు. హంతకులను కాపాడాలనుకునే ప్రతిఒక్కరూ దోషులేనని, ఇందులో సీఎం, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ ఎవరున్నా దోషులేనని అన్నారు. బుధవారం నాగుర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు.

**మానవత్వానికే మచ్చ..**

కుమ్మెరలో నిరుపేద కుటుంబంపై దాడి ఘటన మానవత్వానికే మచ్చగా కేటీఆర్ అభివర్ణించారు. ఈ ఘటనను రాజుకీయం చేసేందుకు తాము రాలేదని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అడిగే బాధ్యత ప్రజలందరిపై ఉందని స్పష్టం చేశారు. మల్లన్న దర్శనం కావాలని అడిగినందుకు ఒక వ్యక్తిపై 20 మంది దాడిచేయడం అధికార అహంకారుమేనని చెప్పారు. విచక్షణ లేకుండా ఒకడు కాలితో తన్నితే రెండు నెలల పాప చనిపోయిందని తెలిపారు. ఈ కేసును పోలీసులు సుమోటోగా తీసుకోవాల్సింది పోయి.. ఫిర్యాదు ఇస్తే సరిగా రాసివ్వలేదని ఇబ్బంది పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాప తల్లి న్యాయం కోసం రోడ్డెక్కే పరిస్థితి రావడం దారుణమైన విషయం అన్నారు.

**8 మందిపై హత్య కేసు నమోదు చేయాలి**

పసిపాపకు కులం, మతం, అధికారం గురించి ఏం తెలుసని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ ఘటన గురించి తెలిశాక ఒక తండ్రిగా తల్లడిల్లిపోయానని ఆవేదన చెందారు. 8 మందిపై హత్యకేసు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే శిక్షపడే దాకా ఉద్యమం ఆపబోమని, అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరి హారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున రూ.లక్ష చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నట్టు తెలిపారు. కేటీఆర్ వెంట ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడి ఉన్నారు.

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District